క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఎంపీడీఓను సన్మానిస్తున్న నాయకులు

విడవలూరు : నూతన ఎంపీడీఓ నగేష్ కుమారిని మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో అరగల ఉదయ్‌భాస్కర్, కొమ్మిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, కాయల సౌంధర్య, ఆవుల శ్రీనివాసులు, భక్తవత్సలం, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌కు అవార్డు



విడవలూరు : స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఈదూరు కిరణ్‌కుమార్‌కు నేషనల్ స్పెషల్ అప్రిసియేషన్ అండ్ మెరిటేరియస్ సర్వీస్ అవార్డు వరించింది. దీనిని ఆయన తమిళనాడులోని కోయంబత్తూరులో అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపల్ బి.సుజాత ఆయన్ను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

• కలెక్టర్‌కు విజ్ఞప్తి

పొదలకూరు: పట్టణంలోని రామనగర్‌గేటు సెంటర్‌లో ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతించవద్దని స్థానిక మహిళలు కలిసి కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం నెల్లూరులో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గేటుసెంటరులో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు అధికారులు కొలతలు కూడా తీసుకున్నారన్నారు. అయితే చుట్టుపక్కల పాఠశాలలు, దేవాలయాలు, నివాసాలు ఉన్నాయన్నారు. దుకాణం ఏర్పాటు చేస్తే పిల్లలు, మహిళలకు ఇబ్బందిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ చొరవ తీసుకుని నూతన మద్యం దుకాణం ఏర్పాటును నిలిపివేయాల్సిందిగా వేడుకున్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించాలి



పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ, వ్యవసాయాధికారి

ముత్తుకూరు: ఈ-క్రాప్ నమోదు కచ్చితంగా చేయించాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణితో కలిసి సోమవారం ఆయన ముత్తుకూరు, బ్రహ్మదేవి, మామిడిపూడి గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదు తీరును ఆరాతీశారు. భూముల సర్వే నంబర్, విస్తీర్ణం, పంట రకాలు తదితర అంశాలను సేకరించాలన్నారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన వీఏఏ సమావేశంలో ప్రసంగించారు. పొలం బడి కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

చెస్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా చెస్ క్రీడాకారులను ఎంపిక చేసే క్రమంలో ఒకరోజు చదరంగం పోటీలను సోమవారం నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ -15 ఓపెన్ పోటీల్లో యజ్ఞేశ్వర్‌రెడ్డి ఎంవీఎస్ హిమ తేజశ్విని, ద్వారకానాథ్, యశ్విన్, సుష్వంత్‌లు విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో సుదీక్ష, గానవిశ్రీ, గీతికశ్రీ రెండు, మూడు, నాలుగు స్థానాలను సాధించారు. వీరు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా తరఫున ఆడుతారు. గెలుపొందిన వారికి కళాశాల కరెస్పాండెంట్ విష్ణు, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి మస్తాన్‌బాబు బహుమతులను అందచేశారు. ఆర్బిటర్ మౌనిక, అబ్జర్వర్ అజీజ్ పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : మతిస్థిమితం లేని మహిళపై దాడిచేసిన ఘటనలో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆనం వెంకటరెడ్డి మున్సిపల్ క్వార్టర్స్‌లో షాహినా కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు వరుసకు పెద్దమ్మ అయిన హసీనాకు మతిస్థిమితం సరిగా లేదు. దీంతో పాటుగా సొంతిల్లు లేకపోవడంతో అప్పుడప్పుడు షాహీనా వద్దకు వచ్చివెళ్లేది. గతనెల 27న తెల్లవారుజామున హసీనా అదే వీధిలోని ఓ అరుగుమీద కూర్చొని ఉంది. పాతమున్సిపల్ ఆఫీసు ప్రాంతానికి చెందిన సాయిచంద్ అటువైపు వెళ్తుండగా హసీనా అతనిని దుర్భాషలాడింది. దీంతో యువకుడు ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. ఈ మేరకు షాహినా సోమవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి సందడి

• దసరా ముహూర్తాలపై నమ్మకం
• కిటకిటలాడుతున్న వస్త్ర, బంగారు దుకాణాలు
• ఖాళీ లేని కల్యాణ మండపాలు
• పనుల్లో జనం బిజీబిజీ

పొదలకూరు: పెళ్లి.. జీవితంలో ఓ మధురానుభూతి. అందుకే అందరూ మెచ్చేలా అత్యంత వైభవంగా జరుపుకోవాలని భావిస్తుంటారు. కాస్త ఆలస్యమైనా అన్నీ సవ్యంగా కుదిరాకే పెళ్లి చేసుకుంటారు. దసరా ముహూర్తాలపై నమ్మకం ఉన్న పెద్దలు తమ పిల్లలకు ఈనెలలో పెళ్లి చేసి ఒక ఇంటి వాళ్లను చేసే పనిలో పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నగరం, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పెళ్లిళ్ల హడావుడి కనిపిస్తోంది. వస్త్ర, బంగారు దుకాణాలు కళకళాడుతున్నాయి. ప్రతి పల్లెల్లో కనీసం రెండు, మూడు పెళ్లిళ్లు దసరా ముహూర్తాలకు ఉన్నట్లు చెబుతున్నారు. ఈనెల 13 నుంచి ముహూర్తాలు ప్రారంభమవుతున్నాయి. 16, 21, 23, 27 తేదీలు దసరా శుభ ముహూర్తాలుగా చెబుతున్నారు. ఆయా రోజుల్లో వేల సంఖ్యలో పెళ్లిళ్లు కుదిరాయి.

ట్రెండ్ మారింది

జిల్లా కేంద్రమైన నెల్లూరులోని వస్త్ర, బంగారు దుకాణాలు కొద్దిరోజులుగా కిటకిటలాడుతున్నాయి. సంపన్నులైతే పెళ్లిళ్ల కోసం రూ.లక్షల్లో ఖర్చులు చేస్తున్నారు. గ్రామాలకు చెందిన యువత సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడడం వల్ల ఖర్చుకు వెనకాడడం లేదు. నెల్లూరు నగరంలోని వస్త్ర, బంగారు దుకాణాలు దుకాణాలు అమ్మాయి, అబ్బాయి తరపు వారితో నిండిపోతున్నాయి. గతంలో వివాహ వేడుకలంటే బ్యాండ్ మేళాలు, భాజాభజంత్రీలు, పూల మండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి చాలా సాధారణంగా ఉండేవి. ఇప్పుడు ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు నిర్వహించడం, ప్రీ వెడ్డింగ్ షూట్ల కోసం ఇతర లొకేషన్లకు, ప్రకృతి, చారిత్రక ప్రాంతాలకు



కిటకిటలాడుతున్న గోల్డ్ షాపు



వెళ్తున్నారు. సినిమాటిక్‌గా వధూవరులచే స్పెషల్ సాంగ్స్ రూపకల్పన చేసి అవి ముందుగానే సోషల్ మీడియాలో విడుదల చేయడం, కల్యాణ వేదికపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపై ప్రదర్శించడం ఇలా విభిన్నంగా వేడుకను చేసుకునేందుకు కొందరు ఇష్టపడుతున్నారు.

ఖాళీ లేని మండపాలు

మండల కేంద్రాల్లో ఉన్న కల్యాణ మండపాలకు కూడా బాగా డిమాండ్ పెరిగింది. పొదలకూరు వంటి పట్టణంలో ఉన్న మండపాల నిర్వాహకులు సైతం రూ.లక్షల్లో అద్దెలను వసూలు చేస్తున్నారు. పూల డెకరేషన్, లైటింగ్ వంటి పనులు చేస్తున్న వారికి చేతినిండా పనులు లభిస్తున్నాయి. బ్యూటీషియన్లకు డిమాండ్ పెరిగింది. వారికి రూ.వేలు చెల్లిస్తున్నారు. ఫుడ్ క్యాటరింగ్ చేస్తున్న వారు కూడా పెళ్లిళ్ల తేదీల్లో క్షణం తీరిక లేదంటున్నారు.



గ్రామీణ ప్రాంతంలో పసుపు దంచుతున్న మహిళలు

పిలుపుల్లో బిజీబిజీ

అమ్మాయి, అమ్మాయి తరపు వారు పెండ్లి పిలుపులతో బిజీబిజీగా ఉన్నారు. ముహూర్తాలు దగ్గర పడుతున్నందున ఆహ్వాన పత్రికలతో బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా పెళ్లి సందడి కనిపిస్తోంది. నవంబర్, డిసెంబర్, జనవరిలో ముహూర్తాలున్నా దసరా ముహూర్తాలపై తల్లిదండ్రులు ఆసక్తి చూపుతుండడం వల్ల గ్రామాల్లో పెద్దవారు పెళ్లి పనుల్లో తీరక లేకుండా గడుపుతున్నారు.

దసరా ముహూర్తాలపై నమ్మకం



దసరా ముహూర్తాలపై పెద్దలకు నమ్మకం బాగా ఉంటుంది. పిల్లలు ఈ ముహూర్తాల్లో పెళ్లి చేసుకుంటే సుఖసంతోషాలతోపాటు అమ్మవారి అనుగ్రహం ఉంటుందనే నమ్మకం ఉంది. పెళ్లిళ్లు వందల సంఖ్యలో ఉన్నాయి.

– పి.రత్నమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్, పొదలకూరు

బంగారు కొనుగోలు పెరిగింది



పెళ్లిళ్ల సందర్భంగా బంగారు కొనుగోలు పెరిగింది. మరో రెండు నెలలు పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ప్రతి గ్రామంలో పెళ్లి ముహూర్తాలున్నాయి.

– కోనం బ్రహ్మయ్య, బంగారు వ్యాపారి, పొదలకూరు

ఇసుక ట్రాక్టర్ సీజ్

మనుబోలు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండల పరిధిలోని జాతీయ రహదారిపై కృష్ణపట్నం పోర్టు జంక్షన్ వద్ద సోమవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై రాకేష్ పోర్టు క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కోట మండలం గూడలి నుంచి వెంకటాచలం మండలం చెముడుగుంటకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గుండాలమ్మపాళెంలో వైద్య శిబిరం



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

కొడవలూరు : మండలంలోని గుండాలమ్మపాళెంలో జ్వరాలు నమోదవుతున్న నేపథ్యంలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జి.బాలచంద్రబాబు పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్త శైలజ పాల్గొన్నారు.

తెలుగుదేశంపై ప్రజల్లో వ్యతిరేకత



మర్రిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

• వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: తెలుగుదేశం పార్టీపై రోజురోజుకు ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, తమ పార్టీ బలపడుతోందని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మర్రిపల్లి గ్రామంలో సోమవారం ఉపసర్పంచ్ సమ్మిడిబోయిన ప్రసాద్ తండ్రి పెంచలయ్య మృతిచెందడంతో కాకాణి పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం ఆయన్ను ఆ ఊరి ప్రజలు పెద్దఎత్తున కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి పంచభూతాలను దోచుకుంటున్నట్టు తెలిపారు. మూడు నెలల్లోనే రూ.కోట్లు విలువ చేసే ఇసుక, మట్టి, బూడిద అమ్ముకున్నట్టు ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా శ్మశానాలు, ఇళ్లకు మట్టి తోలకం పేరుతో పెద్ద ఎత్తున వ్యాపారం సాగిస్తున్నట్టు విమర్శించారు. టీడీపీ దోపిడీని చూస్తున్న జనాలు ఎప్పుడు ఎన్నికలు వస్తాయా తరిమి కొడదామా అని ఎదురు చూస్తున్నట్టు పేర్కొన్నారు. కాకాణి వెంట సర్పంచ్ అంకమ్మ, నాయకులు గోగుల గోపాలయ్య, అంకోజీ తదితరులున్నారు.

పరామర్శ

వెంకటాచలం: మండలంలోని ఈదగాలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలెపు శివయ్యను



శ్యాంసుందర్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. శివయ్య కుమారుడు జశ్వంత్ (17) ఈనెల 5 తేదీన తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకున్న కాకాణి సోమవారం ఈదగాలి గ్రామానికి వెళ్లి శివయ్యను పరామర్శించారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకటశేషయ్య తదితరులున్నారు.

వేమారెడ్డితో చర్చలు

మండలంలోని ఈదగాలి గ్రామానికి చెందిన మాజీ డీసీసీబీ చైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డిని కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాల గురించి ఇరువురు చర్చించుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

• వలంటీర్ల ధర్నా



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వలంటీర్లు

బుచ్చిరెడ్డిపాళెం : ప్రస్తుత ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గత నాలుగు నెలల నుంచి ఇవ్వాల్సిన జీతాలను తక్షణం చెల్లించాలని వలంటీర్లు సోమవారం బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం వారు మాట్లాడారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించి తదుపరి రాష్ట్ర వ్యాప్తంగా మంత్రుల కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామన్నారు.

జాలయ్య సేవలు అమూల్యం

కొడవలూరు : పంచాయతీ కార్యదర్శిగా జాలయ్య అందించిన సేవలు అమూల్యమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కొనియాడారు. నార్తురాజుపాళెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ బోగోలు మండలానికి బదిలీపై వెళ్లిన జి.జాలయ్యను స్థానిక సచివాలయంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో నార్తురాజుపాళెంలో రూ.కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ పనులను పర్యవేక్షిస్తూ సకాలంలో పూర్తయ్యేలా చేయడంలో జాలయ్య కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన ఆసక్తి, చొరవ ఫలితంగానే నార్తురాజుపాళెం రూపురేఖలు మారాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ



జాలయ్యను సన్మానిస్తున్న చలపతిరావు

జి.జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొడవలూరు మోహన్‌రావు, కొండా శ్రీనివాసులరెడ్డి, ఎన్.మాణిక్యరావు, జి.సునీల్, బొచ్చు శ్రీనివాసులు, జి.జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలుగు కాళ్ల మండపానికి శంకుస్థాపన

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో నాలుగు కాళ్ల మండపం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్మాణ దాతలు రాయసం వాసుదేవరావు, దామోదర్‌రావు, రుషికేశ్వర్‌రావు దంపతులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విశేషాలంకరణలో అమ్మవారు

శరన్నవరాత్రులను పురస్కరించుకుని చాముండేశ్వరీదేవి అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. రాత్రి పల్లకిసేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా స్థానికులు పంబాల రఘురామిరెడ్డి– రమణమ్మ దంపతులు వ్యవహరించారు. మైపాడు శివాలయంలో



శంకుస్థాపన చేస్తున్న అర్చకులు

అమ్మవారికి కుంకుమార్చన, పల్లకిసేవ నిర్వహించారు. ఉడతా సుధాకర్, సుజాతమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

వ్యక్తిత్వ వికాస శిక్షణకు హిందీ పండిట్

కొడవలూరు : గుంటూరు జిల్లా నెక్కల్లులోని అబ్బూరి కోటేశ్వరరావు ధ్యాన కేంద్రంలో సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు నేతృత్వంలో 'ఉపాధ్యాయుడే వ్యక్తిత్వ వికాస మార్గ దర్శకుడు' అనే అంశంపై శని, ఆది, సోమ వారాల్లో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇందులో గండవరం జెడ్పీ హైస్కూల్ హిందీ పండిట్ జి.నాగభూషణం ప్రత్యేక ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. బిహేవియర్, మైండ్ ఫిట్‌నెస్ గురించి తెలియజేయడంతో పాటు గాడి తప్పుతున్న పిల్లలకు ఎలా కౌన్సెలింగ్ ఇవ్వాలో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న హిందీ పండిట్

కొత్త అధికారుల బాధ్యతల స్వీకరణ

పొదలకూరు: మండల ఎంపీడీఓగా డీవీ నరసింహారావు సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈయన బుచ్చిరెడ్డిపాళెం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న నగేష్ కుమారి విడవలూరు మండలానికి వెళ్లిన విషయం తెలిసిందే. కొత్త ఎంపీడీఓ మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఆయన్ను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఎంపీటీసీ సభ్యుడు జి.శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు.



నరసింహారావు, ఎంపీడీఓ



గరుడయ్య

➡ పొదలకూరు పంచాయతీ సెక్రటరీగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు.

➡ ఈఓపీఆర్డీగా చేజర్ల నుంచి నారాయణ బదిలీ అయ్యారు. ఈయన ఒకటి, రెండురోజుల్లో బాధ్యతలను స్వీకరించనున్నారు.

➡ మనుబోలు: మనుబోలు పంచాయతీ కార్యదర్శిగా గరుడయ్య సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం కార్యదర్శిగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మనుబోలు: ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ సుబ్బయ్య తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే తహసీల్దార్ మంజుల, ఆర్ఐ నారాయణ, డీటీ బషీర్, వీఆర్వో నాగార్జునరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్

పాహిమాం.. పరాశక్తీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో రాజరాజేశ్వరి అలంకరణలో కామాక్షితాయి



పొదలకూరు: గాయత్రీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



బుచ్చిరెడ్డిపాళెం : ప్రత్యేకాలంకరణలో కోదండరాముడు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా దేవినేని నాగేశ్వరరావు – నందకుమారి వ్యవహరించారు.

➡ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రి అలంకారం చేశారు. ఉదయం వివిధ పూజలను నిర్వహించారు. ఉభయకర్తలుగా రాచపూటి ధనుంజయరావు, నరసింహస్వామి వ్యవహరించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య, సెక్రటరీ రాచపూటి రామలింగయ్య పాల్గొన్నారు.

➡ కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం జరిగింది. దేవస్థానం ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి, కుమార్‌స్వామి పూజలను నిర్వహించారు.

➡ ఇనుకుర్తి గ్రామం శ్రీకాంతమ్మ తల్లి ఆశ్రమంలో అమ్మవారికి పార్వతీదేవి అలంకారం చేశారు. ఆశ్రమ పీఠాధిపతి సుబ్బారెడ్డి స్వామి భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

➡ మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా నారగం దంపతులు వ్యవహరించారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

➡ ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం, బ్రహ్మదేవి, వల్లూరు, ఈపూరు, పిడతాపోలూరు, పైనాపురం, పోలంరాజుగుంట తదితర గ్రామాల్లో అమ్మవారు చండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కాళీయ మర్దనుడిగా కోదండరాముడు

బుచ్చిరెడ్డిపాళెం : దసరా ఉత్సవాల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామస్వామి దేవస్థానంలో కాళీయ మర్దనుడి అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.



పొదలకూరు : వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు



కృష్ణపట్నంలో అమ్మవారికి ప్రత్యేకాలంకరణ



మనుబోలు: మహాచండీ అలంకారంలో..